ప్రజాశక్తి
బుధవారం 11 జనవరి 2023
8 పేజీలు

ఎన్‌టిఆర్
కృష్ణా

కృష్ణలంక పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న టిపిపి శ్రేణులు

వార్త మెయిన్ పేజీలో

# పింఛను రాలేదన్నందుకు ఒంటరి మహిళపై వైసిపి దాడి

- కృష్ణలంక స్టేషన్ వద్ద ఉద్రిక్తత
- స్టేషన్‌ను ముట్టడించిన టిడిపి శ్రేణులు

వార్త 2వ పేజీలో

కొండపల్లిలో జరిగిన పతాకావిష్కరణలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ తదితరులు

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలి : నర్సింగరావు

# 'మైలవరం' రసవత్తరం

- ఎంఎల్ఎ వసంత వ్యాఖ్యలు, ఎంపి కేశినేనితో నాగేశ్వరరావు భేటీతో వైసిపిలో దుమారం
- అప్రమత్తమైన అధిష్టానం
- కృష్ణప్రసాద్‌తో చర్చలు

**మైలవరం నియోజకవర్గ 'రాజకీయం' రసవత్తరంగా సాగుతోంది. వైసిపి ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ సొంత పార్టీపై బాహాటంగా విమర్శలు చేస్తుండగా, ఆయన తండ్రి, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు టిడిపికి చెందిన విజయవాడ ఎంపి కేశినేని నానిని కలవడంపై దుమారం రేగుతోంది. గత రెండు నెలలుగా వసంత ద్వయం వైసిపి ప్రభుత్వంపై తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. తాజాగా ఎంఎల్ఎ కృష్ణ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు, నాగేశ్వరరావు టిడిపి ఎంపితో భేటీ వంటి పరిణామాలు వైసిపి అధిష్టానాన్ని ఇరకాటంలోకి నెట్టాయి. దీంతో ఆ పార్టీ అధిష్టానం అప్రమత్తమైంది. ఆఘమేఘాల మీద కృష్ణప్రసాద్‌తో వైసిపి ఎంపి, ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, వెలంపల్లి శ్రీనివాస్ భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది**

**ప్రజాశక్తి - మైలవరం, విజయవాడ రూరల్**

అధికార వైసిపిలో రోజురోజుకూ అసమతి రాగం పెరిగిపోతోంది. మైలవరం ఎంఎల్ఏ వసంత కృష్ణ ప్రసాద్ సొంత పార్టీపై బాహాటంగా విమర్శలు చేసే విషయంలో తగ్గేదేలే అంటున్న పరిస్థితి నెలకొంది. మరోసారి ప్రభుత్వంపై ఆయన అసంతృప్తి వెళ్లగక్కారు. అధికార పార్టీ శాసనసభ్యునిగా ఉన్న ఆయన మైలవరం మండలం చంద్రాలలో జరిగిన సొసైటీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్ఏ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అక్రమ కేసుల విషయంలో తమ పార్టీలో ఉన్న కొందరు నాయకులపై అసంతృప్తి ఉందని, పది మంది రౌడీలను వెంటేసుకుని తిరగడం చేతగాక పాత తరం నాయకుడిలా మిగిలిపోయానని వ్యాఖ్యానించారు. "55 ఏళ్లుగా మా కుటుంబం రాజకీయాల్లో ఉంది, అప్పటి రాజకీయాలతో పోలిస్తే ఇప్పటి రాజకీయాల్లో గణనీయంగా మార్పు వచ్చింది, నేను రాజకీయ కుటుంబంలోనే పుట్టి పెరిగాను, నేను పుట్టిన సమయంలో నా తండ్రి ఉమ్మడి రాష్ట్ర హోం మంత్రిగా ఉన్నారు, చిన్నతనం (మిగతా 6లో)

కృష్ణప్రసాద్‌తో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి అయోధ్య రామిరెడ్డి

## కృష్ణప్రసాద్‌తోఎంపి అయోధ్య, మర్రి, వెలంపల్లి భేటీ

కష్ణప్రసాద్ వ్యాఖ్యలతో వైసిపి అధిష్టానం అప్రమత్తమైంది. వసంత కృష్ణ ప్రసాద్‌తో మంగళవారం ఎంపి, వైసిపి రీజినల్ కో ఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, వెలంపల్లి శ్రీనివాస్ భేటీ అయ్యారు. మైలవరం నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో వైసిపి మైలవరం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించి రాజకీయ పరిణామాలపై చర్చించారు. కెడిసిసిబి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి కేశినేనిని కలిసిన వసంత నాగేశ్వరరావు

మైలవరం ఎంఎల్ఏ వసంత కృష్ణ ప్రసాద్ తండ్రి, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు సోమవారం టిడిపి ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని)తో భేటీ కావడం కలకలం రేపింది. ఎంఎల్ఏ కృష్ణ ప్రసాద్ వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన తండ్రి నాగేశ్వరరావు కేశినేనితో భేటీ కావడం చర్చనీయాంశమైంది. వైసిపిలో తన కుమారుడికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే ఉద్దేశంతోనే ఆయన కేశినేనితో మంతనాలు జరిపారనే వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే (మిగతా 6లో)

# గుణదల ఫ్లైఓవర్‌కు మోక్షమెప్పుడు?

- పనులు ప్రారంభించి 14 ఏళ్లు
- నేటికీ పూర్తి కాని వైనం
- ఎన్నికల అజెండాతో టిడిపి, వైసిపి నేతలు సరి

**ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి**

గుణదల ఫ్లైఓవర్‌కు ఇప్పట్లో మోక్షం కలిగే పరిస్థితి కనిపించడం లేదు. దాదాపు 14 ఏళ్ల క్రితం ఈ ఫ్లైవోవర్‌కు శంకుస్థాపన జరిగింది. 2009లో పనులు ప్రారంభమైనా నేటికీ ఓ కొలిక్కి రాలేదు. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు దీనిని అడ్డం పెట్టుకొని ఓట్లు మాత్రం దండుకుంటున్నాయి. వంతెన మాత్రం పూర్తి చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణంలో నిర్లక్ష్యం కారణంగా అంచనా వ్యయం కూడా భారీగా పెరిగిపోయింది. రూ.36 కోట్లతో పూర్తికావాల్సిన ఈ ఫ్లైఓవర్ నిర్మాణం వ్యయం ఇప్పుడు రూ.70 కోట్లవుతుందని అంచనా వేస్తున్నారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలో దీని ప్రస్తావన తెరపైకి వచ్చింది. గుణదల నుంచి నున్న వరకు సుమారు 1.2 కిలోమీటర్ల పొడవున వంతెన నిర్మించాలని నిర్ణయించారు. దీనిలోభాగంగా 9 పిల్లర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకుగాను రూ.36 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించారు. 2009లో నిర్మాణ పనులు ప్రారంభించారు. 2015 జనవరి 24 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఎస్‌వి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దీని నిర్మాణ టెండర్లు దక్కించుకుంది. అనంతరం రూ.5.49 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. నాలుగు పిల్లర్లు, హేమర్ హెడ్ బ్లాక్ పనులు పూర్తి చేశారు.

పిల్లర్లతోనే నిలిచిపోయిన గుణదల ఫ్లైవోవర్ (పాతచిత్రం)

అంతేకాకుండా మరో రూ.1.70 కోట్లతో సివిల్, రూ.80 లక్షలతో యుటిలిటీ షిఫ్టింగ్ పనులు, రూ. 2.01 కోట్లతో భూ సేకరణ చేపట్టారు. వీటితోపాటు మరో రూ.98 లక్షలను మొబలైజేషన్ అడ్వాన్స్ కింద చెల్లించారు. అయితే నిర్మాణం జరుగుతున్న సమయంలో టిడిపి, నాటి కాంగ్రెస్ నేతల జోక్యంతో పనులు అటకెక్కాయి. మెట్రో లైన్ నిర్మాణం ప్లాన్ మార్చాలని టిడిపి నేతలు అడ్డుకున్నారు. దీంతో పనులు నిలచిపోయాయి. ఆ తర్వాత ఇది టిడిపి, వైసిపిలకు ఎన్నికల అజెండాగా మారిపోయింది. అధికారంలోకి వస్తే తాము పూర్తి చేస్తామని ఆ పార్టీల నాయకులు పోటీలు పడి వాగ్దానాలు చేశారు. 2014, 2019లోనూ ఇరు పార్టీల నేతులు దీనిపైనే హామీలను గుప్పించారు. 2014లో టిడిపి గెలిచినా నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దీనిని పునర్మిస్తామని ప్రకటించినా ఇంత వరకు కార్యరూపం (మిగతా 6లో)

# అవినీతికి కేరాఫ్‌గా జడ్‌పి

- టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీలో గోల్‌మాల్
- అనర్హులకు ప్రమోషన్లు
- ఓ ప్రజాప్రతినిధి అనుయాయులకు కాంట్రాక్టు పోస్టులు

**ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి**

మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా పరిషత్ కార్యాలయం అవినీతికి చిరునామాగా మారుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. పదో తరగతి మెటీరియల్ కొనుగోలు వ్యవహారంలోనూ పెద్ద మొత్తంలో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. అంతేగాక అర్హతలేని ఓ సూపరింటెండెంట్‌కు ప్రమోషన్ కల్పించడం వివాదంగా మారింది. ఓ ప్రజాప్రతినిధి తన అస్మదీయులకు కాంట్రాక్టు ఉద్యోగాలు కల్పించి అడ్డగోలుగా జీతాల పేరుతో నెలనెలా అడ్డగోలుగా దోచిపెడుతున్నారనే చర్చ జరుగుతోంది. నూతన నియామకాలు అంతా గందరగోళంగా మారాయి. దీంతోపాటు ప్రమోషన్‌పై వచ్చిన ఉద్యోగులకు వర్క్ సీటు కేటాయింపులోనూ గందరగోళం నెలకొంది.

### స్టడీ మెటీరియల్‌కు రెట్టింపు బిల్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పదో

కృష్ణాజిల్లా జడ్‌పి కార్యాలయం

తరగతి చదివే 30 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మెటీరియల్ అవసరమని జిల్లా విద్యాశాఖ గుర్తించింది. ఈ మెటీరియల్‌ను పంపిణీకి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆమోదం తెలిపారు. జిల్లా పరిషత్ ద్వారా స్ఫూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అయితే మెటీరియల్ కొనుగోలులో ఎటువంటి పారదర్శకత పాటించకుండా రెట్టింపు బిల్లులు పెట్టారనే ఆరోపణలు (మిగతా 6లో)

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలి

## 48వ డివిజన్లో వైసిపి వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసి నాలుగు సంవత్సరాలు గడిచిన కారణంగా 48వ డివిజన్‌లో వేడుకలు

ఘనంగా నిర్వహించారు. 48వ డివిజన్ వైసిపి కార్యాలయం వద్ద డివిజన్ ప్రెసిడెంట్ సూరిబాబు, మైనార్టీ నాయకులు చిచ్చా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఐత కిషోర్, రజినీ, జానీ, వరలక్ష్మి, హరిభస్కర్, వరలక్ష్మి, అమర్నాథ్ పాల్గొన్నారు.

## అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఓ మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మంగళవారం విజయవాడ పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి డా. ఎస్. రజిని ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు జరిమానా విధించారు. 2016 ఏప్రిల్ 16వ తేదీ సాయంత్రం కొత్తపేటకు చెందిన వ్యక్తి చిన్న కూతురుతో కలిసి ఫంక్షన్‌కి వెళ్లగా ఆ సమయంలో వరసకు మామయ్య అయిన సోమా రాము ఇంట్లోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న పెద్ద కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ కేసులో రాముపై నేరం రుజువైనందున జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తితీర్పు నిచ్చారు. బాధిత బాలికకు రూ.50 వేలు నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అధారిటీ వారిని ఆదేశించారు.

## భార్య చనిపోయిందని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఏడాది క్రితం భార్య చనిపోయిందనే మనోవేదనకు గురైన భర్త బెల్లంకొండ శ్రీనివాసరావు (52) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి పంచాయితీ వైఎస్ఆర్ కాలనీలో బెల్లంకొండ దేవేంద్ర కుమార్ నివాసం వుంటున్నారు. భార్య మృతితో మనోవేదనకు గురైన శ్రీనివాసరావు మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకుని మృతిచెందారు. శ్రీనివాసరావు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఇండ్ల అగస్త్యకు రెండు బంగారు పతకాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వార్షిక దినోత్సవం సందర్భంగా ఇండ్ల అగస్త్యకు రెండు గోల్డ్ మెడల్స్ అందజేశారు. 10వ తరగతిలో 'బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్

బాయ్'గా కనుమిల్లి సుబ్బారావు మెమోరియల్ గోల్డ్ మెడల్ మరియు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు అన్నిరంగాలలో ప్రతిభ కనబర్చినందుకు పర్వతనేని సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ గోల్డ్ మెడల్ 'బెస్ట్ అల్ రౌండర్ బాయ్' గోల్డ్ మెడల్ ను ముఖ్యఅతిథి ఇన్ కం టాక్స్ చీఫ్ కమిషనర్ అనిల్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు సూరెడ్డి విష్ణు, మలినేని రాజయ్య, చదవలవాడ నాగేశ్వరరావు, లలితప్రసాద్, స్కూలు ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## లక్కీడ్రా విజేతకు ఎల్‌జి టివి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ తమ వినియోగదారుల కోసం సాకర్ ప్రపంచ కప్ టోర్నమెంట్ సందర్భంగా నిర్వహించిన ఒఎల్ఇడి సాకర్ మాన్యనియా ఆఫర్లో భాగంగా లక్కీ డ్రాలో గెలుపొందిన కస్టమర్‌కు రూ.2 లక్షల విలువైన ఎల్‌జి ఒఎల్ఇడి టివిని సోనోవిజన్ విజయా టాకీస్ షోరూమ్‌లో బహూకరించారు. ఈ కార్యక్రమానికి ఎల్‌జి హెచ్ఇ డైరెక్టర్ హాక్యూన్ కిమ్, హెచ్ఇ బిజినెస్ హెడ్ గిరీషన్ గోపి, ఎవి ఎఫ్ఎస్ఇ సంగ్ జి లీ, ఎపి రీజనల్ మేనేజర్ వెంకట కృష్ణాజి, బ్రాంచి

మేనేజర్ పి.కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజేతలకు అభినందనలు తెలిపారు. అలాగే వినియోగదారులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోనోవిజన్ షోరూమ్ అధినేత భాస్కర్‌మూర్తి, ఎల్‌జి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

- సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, నర్సింగరావు
- జాతీయ మహాసభ జయప్రదం కోరుతూ ప్రచారం
- పలుచోట్ల జిఒ 1 కాపీలు దహనం

విజయవాడ బీసెంట్ రోడ్డులో జిఒ కాపీలను దహనం చేస్తున్న ఎవి నాగేశ్వరావు, చందర్లపాడులో జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కార్మిక హక్కులను కాలరాస్తున్న లేబర్‌కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కొండపల్లి పారిశ్రామికవాడలోని హెచ్‌పిసియల్ ఆయిల్ ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన సిఐటియు జెండాను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని సుప్రీం కోర్టు చెప్పినా దాని అమలుకు మోడీ ప్రభుత్వం పూనుకోకపోగా కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు వర్కర్స్‌గా పనిచేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎన్టీఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్, జి.కొండూరు మండల అధ్యక్షులు హెచ్‌పిసియల్ యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.సుందరరావు, జికొండూరు మండల కార్యదర్శి కె.బాలకృష్ణ, కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ:** హాకర్స్ అండ్ తోపుడుబండ్ల యూనియన్ సిఐటియు బీసెంట్ రోడ్ మహంతి మార్కెట్ వద్ద సిఐటియు పతాకాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరావు ఆవిష్కరించారు. అనంతరం జిఒ 1 కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే విధంగా తీసుకుంటున్న చర్యలపై ఆలిండియా మహాసభలో చర్చిస్తామన్నారు. రోజురోజుకి పెరుగుతున్న ధరలు తగ్గించాలని, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు పరం చేయొద్దని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, ఉపాధ్యక్షులు వై.సుబ్బారావు, కార్యదర్శి ఎం.సీతారాములు, సిహెచ్ మురళి, బెవర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. హోటల్స్ అండ్ బేకరి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేట శ్రీనివాస హోటల్ వద్ద సిఐటియు జెండా ఆవిష్కరణ జరిగింది. అనంతరం జీఓ నెంబర్ ఒకటి కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎంవి రమణ, అధ్యక్షులు వి.జగదీశ్వరరావు, జి.కొండయ్య, కె దుర్గ, ఎల్ నాయుడు, వై అప్పలరాజు పాల్గొన్నారు. సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లో కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, పౌరసంక్షేమ సంఘం నాయకులు భూపతి రమణరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం బాబురావు, నాయకులు పవన్‌కుమార్, డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్ పాల్గొన్నారు. ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని ఆలీ బేగ్ స్ట్రీట్ ముఠా సెంటర్ వద్ద జీవో 1 కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం. సీతారాములు, ఎం.బ్రహ్మయ్య, సిహెచ్ నరసింహులు, డి తిరుపతయ్య పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ ఆధ్వర్యంలో మీసాల రాజేశ్వరరావు వంతెన వద్ద ఉన్న పప్పులు మిల్లు ఆటో స్టాండ్ వద్ద సిఐటియు పతాకాన్ని ఎన్‌టిఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం జిఒ 1 కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, నగర కోశాధికారి ఎ.నాగబ్రహ్మం, నాయకులు డి.కాళేశ్వరరావు, వై.దుర్గారావు, నన్నే వలి, ఎండి బాష పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల:** బెంగళూరులో జరిగే సిఐటియు ఆలిండియా మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. కంచికచర్లలో సిఐటియు ఆఫీసు వద్ద ఆమె జెండా ఆవిష్కరించారు. అనంతరం జీవో 1 రద్దు చేయాలని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు సిహెచ్ పుల్లమ్మ, పంచాయతీ కార్మికులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం:** స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు వేముల శ్రీనివాసరావు, పత్తిపాటి జ్యోతి, పత్తిపాటి శైలజ, అంగన్వాడి మండల అధ్యక్షురాలు ఆర్‌వి పుష్పకుమారి, ఝాన్సీ, రమాదేవి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చందర్లపాడు:** మండల కేంద్రమైన చందర్లపాడులో స్థానిక సిఐటీయు ఆఫీస్ వద్ద సిఐటియు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు అధ్యక్షతన ఆశా వర్కర్ వి.రాణి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తోట రామారావు, ఆశా వర్కర్లు కస్తాల మేరి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎ.కమల జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె గోపాల్, చందర్లపాడు కార్యదర్శి ఏసోబు, మండల కమిటీ సభ్యులు కర్రీ వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు పెసరమెయిల్ రవి, బిల్డింగ్ యూనియన్ నాయకులు కలాం, షేక్ గౌస్, కృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో...

మైలవరంలో...

నందిగామలో...

## దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రతి ఒక్కరూ దంత సమస్యలతో అవగాహనతో ఉండాలని డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కూన వందన అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, తిరుమల ఆర్థో అండ్ డెంటల్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు, సిబ్బందికి దంత వైద్య శిబిరాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూన వందన మాట్లాడుతూ దంత సమస్యల పట్ల చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారు. దానివలన మరిన్ని సమస్యలు ఉత్పన్నమై ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయన్నారు. దంతలు ఏ విధంగా శుభ్రం చేసుకోవాలి, ఎలా వాటిని పరిరక్షించుకోవాలనే అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ దంతల పట్ల చాలా మంది పెద్దగా శ్రద్ధ చూపరన్నారు. దానివలన చాలా మంది దంతక్షయంతో బాధపడుతుంటారన్నారు. వాటి అవశ్యకతను విస్మరించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు వీ శేషగిరిరావు, డీ పవన్‌కుమార్, ఎన్ సాంబశివరావులు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## షేక్ రాజాసాహెబ్ ఆస్పత్రి అభివృద్ధికి కృషి : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: కొత్తపేటలోని షేక్ రాజా సాహెబ్ హాస్పిటల్ అభివద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో హాస్పిటల్లో జరిగిన వివిధ రకాల అభివద్ధి పనుల గురించి

ఇంకా జరగాల్సిన అభివద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గడిచిన డిసెంబర్ నెలలో 6,400 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ఆసుపత్రి అభివద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అన్ని విభాగాలకు డాక్టర్స్ అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వాణిశ్రీ పాల్గొన్నారు.

# సిఐటియు మహాసభ జయప్రదానికి పిలుపు

ఉయ్యూరులో

గన్నవరం మండలంలో

కంకిపాడులో

గుడివాడలో

ప్రజాశక్తి-యంత్రాంగం

సిఐటియు అఖిల భారత మహాసభలు ఈనెల 18 నుండి 22 వరకు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా విజయవంతం చేయాలని కోరుతూ జిల్లాలో పలుచోట్ల ఆ సంఘం నాయకులు పతాకావిష్కరణలు మంగళవారం చేశారు. **ఉయ్యూరు :** స్థానిక మానికొండ సుబ్బారావు సూర్యావతి శ్రామిక భవనం వద్ద సిఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సిఐటియు ఉయ్యూరు మండల కార్యదర్శి సజ్జ బాలగంగాధర్ తిలక్, నాయకులు బంద్రపల్లి రాజేష్, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కోసూరు శివ నాగేంద్రను గృహనిర్బంధంలో ఉంచారు. సిఐటియు సీనియర్ నాయకులు రత్నం భాస్కర రావు జెండాని ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు పడాల లక్ష్మణరావు, కృష్ణాజిల్లా డివైఎఫ్ఐ కన్వీనర్ బాజీబాబు తెల్లాకుల, కెవిపిఎస్ కార్యదర్శి నిమ్మాది గోపాలం, ముఠా కార్మికులు ,ఇతర సిఐటియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు :** కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను తిప్పి కొట్టాలని సిఐటియు కంకిపాడు మండల కార్యదర్శి టి నరేష్ పిలుపునిచ్చారు. కంకిపాడు మండేపూడి నాగభూషణ రెడ్డి భవనం వద్ద సిఐటియు సీనియర్ నాయకులు సి హెచ్ వి రెడ్డియ్య జెండా ఆవిష్కరణ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జి.కుమారి, అధ్యక్షులు ఎం రజిని, కె గోపి, పఠాన్ మహమ్మద్ ఖాన్, ఎం మురళీమోహన్, జీ వి శాస్త్రి, నాయుడు, రావూరి సత్యవతి పాల్గొన్నారు. **బంటుమిల్లి :** స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు పూర్వపు కార్యదర్శి వంగల రాజు జెండాను ఆవిష్కరించారు. సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్ అజయ్ ఘోష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, బాబూరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఆకునూరి వెంకటేశ్వరరావు, మిడ్ డే మీల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కాగిత వీర రాఘవ, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు కాంతారావు, బాలయోగి తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** స్థానిక ఆటోనగర్ లో రాష్ట్ర సిఐటియు పిలుపు మేరకు సిఐటియు జెండాని కార్యదర్శి టి.లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో జీవో 1 కాపీని దగ్ధంచేశారు. ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొంత వెంకటేశ్వరరావు, ఇసుక ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు పల్లపు ప్రభుదాసు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.కొండ, నాయకులు నాగరాజు, రంగారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**నాయకుల గృహ నిర్బంధం సరికాదు : సిఐటియు**

**గన్నవరం :** సిఐటియు కార్యకర్తలు, నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేయడం సరికాదని సిఐటియు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి రవి తీవ్రంగా ఖండించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తీరు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు ,సిఐటియు మండల ఉపాధ్యక్షులు బెజవాడ .తాతబ్బాయి, బదుగు మరియదాసు, ఎర్రగుంట్ల నాగలక్ష్మి, ఎం.లలిత తదితరులు పాల్గొన్నారు. గన్నవరం మండలం చనుపల్లి వారిగూడెంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి .రవి,జిల్లా కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు బెజవాడ తాతబ్బాయి, నందేటి చంటి, కార్మికులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ

ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని గుడివాడ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గత మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడాన్ని తప్పు

పట్టారు. అలాగే కార్మికులకు గ్యాస్ బండలు కూడా ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. జీతంగా ప్రతినెలా రూ.5000లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లతాదేవి, లూర్దు మేరీ, సలోమి, బి వెంకటేశ్వరమ్మ, ఎన్ మరియమ్మ, శకుంతల, మధుర, రజిని, వి దుర్గ పాల్గొన్నారు.

## గోడపత్రిక ఆవిష్కరణ

**గుడివాడ :** జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే యువశక్తి భారీ బహిరంగ సభను జన నాయకులు జయప్రదం చేయాలని జనసేన పార్టీ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక జనసేన కార్యలయలంలో బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహించే యువశక్తి భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొదమల గంగాధర్, నాయకులు మజ్జి శ్రీనివాస్, సాయిని రాజేష్, వేమూరు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి పోస్టర్ల ఆవిష్కరణ

**అవనిగడ్డ :** సైకో ప్రభుత్వం పోవాలి... సైకిల్ ప్రభుత్వం రావాలి అంటూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అవనిగడ్డ రాజు సెంటర్లో నిరసన తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆదేశాలతో అవనిగడ్డ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం పార్టీ కార్యాలయం నుండి రాజీవ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, ఘంటసాల రాజామోహనరావు, అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ, బుక్కా శ్రీనివాసరావు, యలవర్తి చిన్న, బర్మా శ్రీనివాసరావు, చెన్ను గాంధీ, మేఘావత్ గోపి, కోట సాయి, రేపల్లె కృష్ణారావు, కొండవీటి బాబు, పరిమిశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకూ మన ప్రభుత్వం

**పెదపారుపూడి :** దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల పక్షపాతిగా, సంక్షేమ సారధిగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని కొర్నిపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పేదలకు ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. బుక్‌లెట్లు పంపిణీచేశారు. హౌసింగ్ రుణాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే స్థానికులు కోరారు. అనంతరం మండలంలోని రావులపాడు గ్రామంలో మనబడి నాడు – నేడు ఫేస్ 2 క్రింద అంగన్వాడీ భవనానికి (అంచనా విలువ రూ.16 లక్షలు) శంకుస్థాపన శంకుస్థాపనచేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో గోగం సురేష్, గ్రామ సర్పంచ్ గోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి, తహశీల్దార్ వి.నాగభూషణం, అంగన్వాడీ సూపర్వైజర్ శివ నాగమణి, చీకుర్తి వరప్రసాద్, తుమ్మల కోటేశ్వరరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హాకీ టోర్నమెంట్ డైరెక్టర్గా శ్రవణం రామకృష్ణ

**మచిలీపట్నం అర్బన్ :** రాష్ట్ర హాకీ టోర్నమెంట్ డైరెక్టర్గా శ్రవణం రామకృష్ణ పరమహంస ఎంపికయ్యారు. 13వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా అంతర్ జిల్లా హాకీ చాంపియన్‌షిప్ టోర్నమెంటుకు డైరెక్టరుగా వ్యవహరిస్తారు. మంగళవారం హాకీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి జి.హర్షవర్ధన్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ నెల11 నుంచి 13 వరకు ఏలూరులో జరిగే 13 వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా అంతర్ జిల్లా హాకీ టోర్నమెంట్ జరుగనుంది. ఈ టోర్నమెంటులో బెస్ట్ పెర్ఫార్మన్స్ కనబర్చిన క్రీడాకారుల్ని ఆంధ్ర హాకీ టీముకు ఎంపిక చేస్తారు. రామకృష్ణ ప్రస్తుతం నందమూరు వాసవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫిజియల్ డైరెక్టర్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కళాశాల చైర్మన్ గుడివాడ మెహర్ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్ బాబా, కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తమ్మన సాయి కుమార్, దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఆర్.ఎస్. రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

## అభివృద్ధి ప్రణాళికపై సదస్సు

**బంటుమిల్లి :** బంటుమిల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ స్వర్ణ భారతి ఆధ్వర్యంలో 2023-2024 విద్యా సంవత్సరానికిగాను పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, ఆవాస ప్రాంత ప్రణాళిక అభివృద్ధిపై సమీక్షా సమావేశం మంగళవారం జరిగింది. ఎంపిడిఒ మాట్లాడుతూ 2023-24 బడ్జెట్ ప్లాన్ తయారీ చేసి మండలంలోని అని పాఠశాలలను అభివృద్ధి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ ఎం.రాజబాబు, ఎంఇఒ కెవిఎస్ ప్రసాద్ , సిడిపిఒ, హెచ్‌ఎంలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత : పేర్ని

**కలెక్టరేట్ (కృష్ణా) :** ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉన్నతాధికారులు సైతం తరచూ గృహ నిర్మాణం ఇళ్ల స్థలాల విషయమై సమీక్షిస్తున్నారని మాజీ మంత్రివర్యులు మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య ( నాని ) పేర్కొన్నారు. మంగళవారం ఆయన కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత్ సింగ్‌ను ఆమె కార్యాలయంలో కలిసి మచిలీపట్నం నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ఒకటి రెండు నెలల్లో టిడ్కో ఇళ్లు అప్పగించాలనే లక్ష్యంతో పనులపై దృష్టి సారించామని బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలు ఉపయోపగపడుతున్నాయన్నారు. మచిలీపట్నం ఆర్డీవో ఐ.కిషోర్, మచిలీపట్నం తహశీల్దార్ సునీల్ బాబు, గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిమయంగా రాష్ట్ర పాలన : వర్ల

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్‌రాజా విమర్శించారు. పమిడిముక్కల మండలంలోని కూడేరు గ్రామంలోటిడిపి ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో మంగలవారం ఆయన మాట్లాడారు. వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం, మట్టి, ఇసుక దోపిడీ ఎక్కువైపోయిందన్నారు. పెరుగుతున్న ధరల నియంత్రణలో వైసిపి ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, ఆలీ దేవరపల్లి నాగరాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, సుబ్బారావు, లక్ష్మి, దుర్గమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఎండ్లబండి లాగుడు పోటీలు

**గుడివాడ :** ఎన్టిఆర్ టు వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనను ప్రజలు జయప్రదం చేయాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను తెలిపారు. మంగళవారం స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), ఆయన సోదరుడు చిన్నిల సహకారంతో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతున్నాయన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకటరమయ్య(నాని) ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నందివాడ ఎంపీపీ పేయ్యల ఆదాం, వైసిపి రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలు ప్రారంభం

**గుడివాడ :** స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎన్టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి సంబరాలను ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం పలువురు మహిళలు ముగ్గులు తదితర పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యులు బొగ్గవరపు తిరుపతయ్య, జడ్డిలు రమ్యరెడ్డి, రజిని, ఎస్.వి.వి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్ డిఎస్‌పి

ప్రజాశక్తి-గన్నవరం

ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామ శివారు వీవీఆర్ హౌసింగ్ ప్లాట్స్ వద్ద ఈ నెల 2 వ తేదీన ఒక గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించిన ఘటనలో నిందితుడిని ఆత్కూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో గన్నవరం డీఎస్పీ విజయ పాల్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కోలవెంటి వీరాస్వామి ( 66 ) తేలప్రోలు గ్రామంలో ప్లాట్‌ఫారమ్ రిక్షా నడుపుతూ జీవనం సాగి స్తున్నాడు అతనికి పొగాకు, మద్యం తాగే అలవాటు ఉంది . డిసెంబరు 30న మతిస్థిమితం లేని అనారోగ్యంతో ఉన్న ఓ మహిళ (35) తేలప్రోలు దళితవాడ ప్రాంతంలో సంచరించింది. ఇది గమనించిన వీరాస్వామి ఆ మహిళకు మద్యం తాగించి తన కోరిక తీర్చుకోవాలనే దురుద్దేశంతో 31 వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు ఆమెను గ్రామ శివారులో ఉన్న వీవీఆర్ ప్లాట్‌లోకి తన రిక్షాపై తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై లైంగికదా డికి యత్నించగా , ఆమె ప్రతిఘటించగా చంపేశాడని తెలిపారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో అధునాతన సేవలు

## శ్రీలేఖ పవర్ ప్రింటర్స్ ఎండిలు నాగేశ్వరరావు, సంగమేశ్వరరావు

**విజయవాడ:** రాజధాని నగరంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ, పరిసర పట్టణాల్లో రోజురోజుకి పెరుగుతున్న ప్రింటింగ్ అవసరాలు తీర్చడానికి ముద్రణ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అధునాతన సేవలందించే ధ్యేయంతో విజయవాడ నగరంలో 2004లో శ్రీలేఖ పవర్ ప్రింటర్స్‌ను ప్రారంభించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు నాగేశ్వరరావు, సంగమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ డిజిటల్ ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్, ప్రింటింగ్ ప్రెస్ వంటి విభాగాల్లో 18 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన ఏకైక సంస్థ శ్రీలేఖ పవర్ ప్రింటర్స్ అని చెప్పారు. నాటి నుండి నేటి వరకు ఉన్నతశ్రేణి ప్రమాణాలతో సర్వీసు అందిస్తున్నామన్నారు. విజయవాడ, ఇతర ప్రాంతాల నుండి ప్రింటింగ్ అవసరాల కోసం వచ్చే వినియోగదారులకు బెస్ట్ ఛాయిస్‌గా తమ సంస్థ నిలిచిందన్నారు. నాణ్యమైన సేవలను వినియోగదారులకు అందించడం ఎంత ముఖ్యమో, వారిని సంతృప్తి పరచడం కూడా అంతే ప్రధానమైనదిగా భావిస్తున్నామన్నారు. ఆ నమ్మకమే తమ అభివృద్ధికి దోహదపడిందని తెలిపారు. అంకితభావంతో పని చేస్తున్న సిబ్బందితోనే సవాళ్లను, లక్ష్యాలను అధిగమిస్తున్నామని చెప్పారు. డిజిటల్ ప్రింటింగ్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, అధునాతన సేవలను వినియోగదారులకు అందించడంలో శ్రీలేఖ పవర్ ప్రింటర్స్ ముందు వరుసలో నిలుస్తుందన్నారు. వ్యాపార అవసరాలకు, ఇతర వివరాలకు నెహ్రూ స్ట్రీట్, సీతారాంపురం వద్ద ఉన్న తమ ఆఫీసులో సంప్రదించవచ్చన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రతిఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

**ప్రజాశక్తి-కంచికచర్ల:** మండలంలో మంగళవారం పలు విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉషోదయ స్కూల్‌లో పాఠశాల ఆవరణలో విద్యార్థినిలు రంగవల్లులు వేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేసిన ముగ్గులు తెలుగుదనాన్ని ప్రతిబింబించాయి. తొలుత ఉదయాన్నే భోగి మంటలు వేశారు. అనంతరం చిన్నారులకు భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పతంగులు ఎగురవేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ కుర్రా కిరణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుర్రా హరీషా, కుర్రా వీరభద్రరావు పాల్గొన్నారు. స్థానిక జుజ్జూరు రోడ్డులోని శ్రీ అక్షర పాఠశాల కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు.

## యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ రెడ్డిగూడెం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. నూతన అధ్యక్షునిగా పిల్లి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా మిక్కిలి బాలకోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక నియామక పత్రాన్ని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఎన్నికల అధికారి డి.అపర్ణ అందజేశారు. ఉపాధ్యక్షులుగా కట్టా రవిబాబు, ఎస్ఎస్ సుజాత, కోశాధికారిగా మల్లాది తిరుపతిరావు, కార్యదర్శులుగా ఎ.వేణుబాబు, ఎ.బిక్షాలు, జి.రవినాథ్, జి ప్రసాద రెడ్డి, కట్టా విజయకుమార్, ఆడిటర్‌గా చింతిరాల లక్ష్మయ్య, జిల్లా కౌన్సిలర్లుగా డి.నాగరాజునాయక్, జి.ఎస్తేరురాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు మచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు పటాపంచల భవానీ తదితరులు పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని జేఆర్సి-విశ్వభారతి డిగ్రీ కాలేజ్‌లో బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్న గంటా సింధు, గంటా సంధ్య కృష్ణా యూనివర్సిటీ స్థాయి గర్ల్స్ వెయిట్

లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గంటా సింధు 55 కేజీల విభాగం, వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. గంటా సంధ్యశ్రీ 47 కిలోల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానం, పవర్ లిఫ్టింగ్‌లో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థులను జెఆర్‌సి కళాశాల యాజమాన్యం చైర్మన్ రంగాపురం నరసింహారావు, కరెస్పాండంట్ పెనుగొండ వెంకటరాజీవ్, ప్రిన్సిపల్స్ జె.వెంకటేశ్వర్లు (అబ్బులు), కె.నాగరమేష్, విశ్వభారతి డైరెక్టర్లు జె.తిరుపతిరావు, నారాయణరావు అభినందించారు.

## కబడ్డీ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** మండల కేంద్రంలో దళితవాడ యూత్ ఆధ్వర్యంలో ఆంధ్రా - తెలంగాణ స్థాయిలో కబడ్డీ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెవ జి విశ్వనాథ్, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సందర్భంగా యువకులను ప్రోత్సహించే విధంగా ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పైడిమర్ల కిరణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చాట్ల చందా, పోతురాజు, శేఖర్, చాట్ల సుందరరావు, వెంపటి రాజేష్, కమిటీ సభ్యులు అయ్యంకి వెంకట్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# మీసేవా నిర్వాహకులను ఆదుకోండి

## 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎంఎల్ఎ జగన్మోహనరావుకు మొర

**ప్రజాశక్తి-కంచికచర్ల:** గ్రామాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారుల చెంతకు చేరవేసేందుకే సచివాలయాలు దోహదపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కంచికచర్ల 7వ వార్డు పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీసేవ కేంద్రానికి వెళ్లి సత్యనారాయణను పలకరించారు. మీసేవ నిర్వహణ రానురాను భారమైందని, తమ బాధలు తొలగించేలా ప్రభుత్వానికి విన్నవించాలని మీసేవ నిర్వాహకుడు చాప సత్యనారాయణ మొరపెట్టుకున్నాడు. వ్యాపారం ఎలా ఉందని అడిగిన ఎమ్మెల్యేకు అసలు వ్యాపారం పూర్తిగా కుంటుబడిందని గతంలో ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తూ ఉన్న తాము ప్రస్తుతం సచివాలయాలు కారణంగా ఏ పని లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని తెలిపారు. మీసేవ నిర్వహణలో భాగంగా ఇన్కమ్ టాక్స్ రిటర్న్ వల్ల రేషన్ కార్డు కూడా తొలగించారని వాపోయారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, ఉపసర్పంచ్ వేమా సురేష్‌బాబు, నాయకులు నారిశెట్టి శ్రీనివాస్, వంగా శ్రీనివాసరావు, గురవయ్య, వేల్పుల శ్రీనివాస్, ఏయంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకరరావు పాల్గొన్నారు.

## 14 నుంచి ఆటల పోటీలు

**ప్రజాశక్తి-విజయవాడ రూరల్:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 14, 15, 16 తేదీలలో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో పి.నైనవరంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల నాయకులు మాతంగి నాగమల్లేశ్వరరావు, చప్పిడి రాంబాబు, పి.కళావతి తెలిపారు. 14న 4 నుండి 8వ తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, స్త్రీలకు ముగ్గులు, 15న సైకిల్ స్లో, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, 16న డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

## కార్మికులకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి-గంపలగూడెం:** స్థానికంగా ఉన్న గ్రామపంచాయతీ పరిధిలోని పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట పుల్లమ్మ, విఒ జి.శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ తలపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క తొలగింపు

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ఎర్రకాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను మంగళవారం తొలగించారు. ఈ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివ కోటేశ్వరరావు, ఎఇ హనుమంతురావు, కౌన్సిలర్ రోషయ్య పాల్గొన్నారు.

## వాగ్దేవిలో సంక్రాంతి సంబరాలు

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని వాగ్దేవి మహిళా కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను కళాశాల కరస్పాండెంట్ సరిత అందజేశారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# శ్మశానానికి దారి చూపరూ...

## ఎంఎల్ఎ రక్షణనిధికి కొత్తపల్లి దళితుల మొర

**ప్రజాశక్తి-గంపలగూడెం:** శ్మశానికి దారి కల్పించాలని మండలంలోని కొత్తపల్లి గ్రామ దళితులు కోరుతున్నారు. పూర్వకాలం నుండి 260/ 2 సర్వే నంబర్లో 60 సెంట్లు దళితులకు సంబంధించి శ్మశాన స్థలం ఉన్నా దానిని ఉపయోగించుకునేందుకు దారిలేదు. ఒక వైపున వాగు, మరో మూడు వైపులా వ్యవసాయ భూములు, కంపచెట్లు ఉన్నాయి. గతంలో వర్షాలు పడని, పంటలు వేయని సమయంలో తప్ప మరి ఏ సమయంలోనైనా ఎవరైనా గ్రామంలో చనిపోతే ఎక్కడ సమాధి చేయాలో తెలియని దుస్థితి దళితులకు నెలకొంది. నేడు వ్యవసాయ భూముల మీదుగా వెళ్లేందుకు యజమానులు నిరాకరిస్తున్నారు. దిక్కులేని స్థితిలో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్టలేరు నిండుగా పారుతున్నప్పటికీ చేసేదేమీ లేక అక్కడ ఇసుకను తీసి అక్కడ దహన సంస్కారాలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈలోపు వర్షాలు, కట్టలేరు వరద ఉధృతికి మృతదేహాలు కొట్టుకుపోతున్నాయని దళితులు వాపోతున్నారు. ఈ దుస్థితిని అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితంలేదని తెలిపారు. అప్పటి తిరువూరు ఎమ్మెల్యే దిరిశం పద్మజ్యోతికి విన్నవించగా ఆమె ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికారులు దళితుల ఖర్చులతో సర్వే చేసి హద్దులు చూపించారుగానీ అందులోకి వెళ్లేందుకు దారి చూపించలేదని చెప్పారు. దీంతో గత పరిస్థితులే అక్కడి దళితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. గడిచిన పంచాయితీ ఎన్నికల్లో ప్రస్తుత గ్రామ సర్పంచ్ నరెడ్ల ఓగిరెడ్డి దళితుల శ్మశానానికి అరెకరం పొలాన్ని కొనుగోలు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. నేటికీ అందుకు అవసరమైన స్థల సేకరణ జరగలేదని గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని దళితులు ఎదురుచూస్తున్నారు.

### స్థలం పనికి రాకుండా పోతుంది

**మోదుగు ప్రభాకర్‌రావు**

దశాబ్దాల తరబడి మాకు శ్మశాన స్థలం ఉంది కానీ అందులోకి రైతులు పోనివ్వరు. దానికి అవసరమైన ప్రత్యేక దారి లేదు. అందువల్ల ఆ స్థలంలో సమాధి చేసిన వారి కంటే కట్టలేరు వరదలో వదిలేసిన మతుల సంఖ్య ఎక్కువ. ఆ స్థలం ఉన్నప్పటికీ సుఖం లేదు.

### దారి ఏర్పాటు చేయాలి

**కొర్రకప్పు వేణుబాబు**

మా దళితవాడకున్న 60 సెంట్లు శ్మశాన స్థలం రైతుల ఆక్రమణ, కంపచెట్లతో మూసుకుపోయింది. అప్పటి ఎమ్మెల్యే పద్మజ్యోతి సర్వే చేయించారు. కానీ దారి ఇప్పించలేదు. అందువల్ల ఎప్పటిలాగే ఇబ్బంది పడుతున్నాం. ఎమ్మెల్యే రక్షణనిధి చొరవ చూపి ప్రత్యేక రహదారి ఏర్పాటు చేయాలి.

### మరోసారి సర్వే చేయాలి

**ఎక్కిరాల వెంకటేశ్వర్లు**

ఇంతకాలం జరగని పనిని ఎమ్మెల్యే రక్షణనిధి ద్వారా జరుగుతుందని ఆశిస్తున్నాం. మా స్థలాన్ని మరోసారి సర్వే చేయించండి. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రహదారి సౌకర్యం కల్పిస్తారని ఆశిస్తున్నాం.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

## వాస్తవాలకు ప్రతిరూపం ప్రజాశక్తి

### కేలండర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ కైలే

**ప్రజాశక్తి-పెదపారుపూడి**

నిరంతరం ప్రజలకు అండగా ఉంటూ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న ప్రజాశక్తి వాస్తవాలకు అద్దంగా, ప్రతిరూపంగా నిలుస్తుందని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అన్నారు. పెదపారుపూడి మండలంలోని రావులపాడు గ్రామంలో 2023 ప్రజాశక్తి కేలండర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కూడా వాస్తవాలను మాత్రమే పాఠకులకు ప్రజాశక్తి అందిస్తోందన్నారు. ప్రజాశక్తి వార్తలు, కథనాలు, ప్రత్యేక సంచికల్లో మంచి సమాచారం ఉంటుందన్నారు. సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేసేందుకు ముందుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, సర్పంచి గోళ్ళ సోమేశ్వరరావు, చిగురుపాటి శ్రీధర్, చీకుర్తి వరప్రసాద్, నాగార్జున, పెదపారుపూడి ప్రజాశక్తి విలేకరి నత్తా భూషణ్ కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌విఎల్‌లో సంక్రాంతి సంబరాలు

**ప్రజాశక్తి-అవనిగడ్డ**

ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆయన

ఎస్‌విఎల్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

తనయుడు సింహాద్రి వికాస్‌ను ఆయన స్వగృహం నుంచి ఎడ్ల బండి పై కళాశాల ప్రాంగణానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి భోగి మంటలు, కోడిపందాలు, జానపద నృత్యాలు, సాంస్కృతిక విన్యాసాలతో విద్యార్థులు అలరించారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరికీ భోగ భాగ్యాలను సంక్రాంతి సుఖ సంతోషాలను కనుమ కమ్మని అనుభూతులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్‌పి మహబూబ్ బాషా, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్స్ ఎన్వి నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ లతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్**

విద్యుత్ లైన్లకు మరమ్మతులు జరుగుతున్న కారణంగా మచిలీపట్నంలోని రుస్తుంబాద, చమ్మనగిరిపేట, రాజా గారి సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మచిలీపట్నం ఎపిసిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : జోగి

**ప్రజాశక్తి-గూడూరు**

పేదలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందటమే రాష్ట్రప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి లబ్ధి పొందిన వివరాలు తెలియజేస్తూ బుక్ లెట్లు అందజేశారు. ఓటిఎస్

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

క్రింద జగనన్న శాశ్వత గృహహక్కు పత్రాలు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ సిఎం జగన్ రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ విలువ చేసే ఆస్తి మీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసి గిఫ్టుగా ఇచ్చారన్నారు. ఈ ఆస్తిని సొంతంగా అనుభవించొచ్చునన్నారు. లేదా పిల్లలకు వారసత్వ ఆస్తిగా ఇవ్వొచ్చునని వివరించారు. రైతు భరోసా కేంద్రం వీధిలో విద్యుత్ స్థంబాలు వేయించాలని, కొన్ని వీధులలో డ్రైనేజీలు నిర్మించాలని ఈ విధంగా ఈ పర్యటనలో మంత్రి దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కప్పలదొడ్డి అంగన్వాడీ కేంద్రాన్ని మంత్రి సందర్శించి చిన్నారులతో కొద్ది సేపు ముచ్చటించారు. ఇప్పుడు ఇస్తున్న రూ.2,750 పింఛన్‌ను మళ్లీ జనవరి నాటికి రూ.3000లకు పెంచుతామన్నారు. ఈ పర్యటనలో మంత్రి మాట్లాడుతూ కప్పలదొడ్డి గ్రామంలో జలజీవన్ మిషన్ క్రింద రూ.95 లక్షలు మంజూరయ్యాయన్నారు. టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభించి గ్రామంలో 462 కుళాయి కనెక్షన్లు త్వరలో అందజేస్తామన్నారు. ఈ పర్యటనలో ఎంపీడీవో డి.సుబ్బారావు, ఇఒఆర్‌డి రజావుల్లా, హౌసింగ్ డిఇ ఎ.శ్రీనివాసరావు, అగ్రికల్చరల్ ఏవో హెబ్సిబా, వివిధ శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు మంత్రి వెంట ఉన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపిపి సంగ మధుసూధనరావు, సర్పంచ్ మాధవి, ఎంపిటిసి తేజోవతి, పార్టీ నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కటారికి మండలి పరామర్శ

**ఘంటసాల :** శ్రీకాకుళం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కటారి తాతయ్య మాతృమూర్తి, శతాధిక వృద్ధురాలు నాంచారమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం టిడిపి నాయకులు ద్వారా తెలుసుకున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మంగళవారం కటారి తాతయ్యను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, టిడిపి రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా ), గ్రామ సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు దాసం రామకష్ణ, టిడిపి నేతలు మేకా శ్రీను, నవత రాంబాబు, ఆత్కూరి నాగరాజు, కుంపటి చిట్టిబాబు, కోటి శీను, కోటి పాల్గొన్నారు.

# 31న గన్నవరంలో బాలోత్సవ సంబరాలు

**ప్రజాశక్తి-గన్నవరం**

గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 31న పిల్లల పండుగ(బాలోత్సవం) నిర్వహిస్తున్నట్లు గన్నవరం బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు గన్నె వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్ తెలిపారు. మంగళవారం గన్నవరంలోని కమిటీ కార్యాలయంలో బాలోత్సవం బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ మన కంటి వెలుగు , మన కలల మెరుపు మన పిల్లలే అన్నారు. ఇంటా బయటా వెల్లివిరిసేది , ఆహ్లాదం వెల్లువెత్తేదీ చిన్నారులతోనే అని పేర్కొన్నారు. ఒక పక్క బాలల , ప్రతిభా పాటవాలూ , శక్తి యుక్తులు పెరుగుతున్నాయని, కొత్త రకమైన ఆటలు , సినిమాలు , సాంస్కృతిక రూపాలు సైతం సెల్ఫోన్లు , ఇంటర్నెట్ , టీవీల ద్వారా పిల్లలకు అందుతున్నాయన్నారు. మరోవైపు చూస్తే ఆటపాటలూ , వ్యాయామం , శారీరక శ్రమ తగ్గిపోతున్నాయని చెప్పారు. పుస్తకాల కుస్తీ , పాఠాల బట్టీ , హోం వర్క్ యుద్ధం ఇదే బడిపిల్లల జీవితంగా మారిందన్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో మానవ సంబంధాలూ బలహీనవడ్డాయని, కుటుంబ బంధాలూ , స్నేహభావాలు కుంచించుకుపోతున్నాయని తెలిపారు. సహకారతత్వం సడలుతోందని పెద్దవారికి , సాటివారికి సేవ చేయాలన్న భావన కొరవడుతోందని వివరించారు. ప్రస్తుతం కుటుంబాల్లో పిల్లలు ఎన్ని నేర్చుకున్నా వాటిని ప్రదర్శించేందుకు వేదికలూ , వేడుకలూ పెద్దగా ఉండటం లేదన్నారు. ఇళ్లలో పెద్దవారు ఉండక , ఉన్నా , పిల్లలకు కేటాయించే సమయం చాలక కథలూ కబుర్ల ద్వారా ధైర్యం , శౌర్యం , సేవాగుణం వంటి వాటి గురించి వినే అవకాశాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలను ఒక వేదిక మీదకు తీసుకువచ్చి అన్ని రంగాల్లో వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి బాలోత్సవ కమిటీ కషిని చేపట్టిందన్నారు. విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని ప్రతి విభాగంలోను ప్రథమ , ద్వితీయ , తృతీయ స్థానాలు ఇవ్వబడతాయని చెప్పారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వబడుతుందన్నారు. అప్లికేషన్స్ పంపడానికి ఈనెల 25 వరకూ గడువు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనుమోలు వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, మరీదు వరప్రసాద్, రాజబాబు, పిల్లి మహేష్, ఎం.జయమ్మ, అనుమోలు విజయ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలోత్సవం కమిటీ ప్రతినిధులు

## క్షతగాత్రులకు వైసిపి సాయం

**ప్రజాశక్తి - మోపిదేవి**

వంట గ్యాస్ లీకైన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షత గాత్రులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సాయమందించారు. మోపిదేవి మండల పరిధిలోని పెదకళ్ళేపల్లి గ్రామానికి చెందిన పేరం

పరామర్శిస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

పోతురాజు, పేరం వెంకటేశ్వరరావు సోదరులు వంట మేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం వంట చేస్తుండగా వంట గ్యాస్ లీకైన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన పోతురాజు, వెంకటేశ్వరరావులను అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు. పార్టీ నేతలు సమకూర్చిన నగదు రూ. 25 వేలను సింహాద్రి వారికి అందించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అర్జా లక్ష్మీ తులసి, వైసిపి గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, సీనియర్ నేత తోట కష్ణ, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ అర్జా వెంకట సుబ్బారావు, తైలం బ్రహ్మరాజు, అర్జా చలపతిరావు, చెన్నకేశవులు, నాని తదితరులు పాల్గొన్నారు.

## యువశక్తి కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కోడూరు**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తోనే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని కోడూరు మండల జనసేన పార్టీ నేతలు తెలిపారు. మంగళవారం కోడూరు మండల జనసేన పార్టీ

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆధ్వర్యంలో ఈనెల 12వ తారీఖున శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరిగే యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర వలసలు, ఎంతో మంది విద్యార్థులు చదువుకున్నప్పటికీ ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా యువత మిగిలిపోతున్నారని, వాటన్నిటిని గురించి కూడా ఈనెల 12వ తేదీన పవన్ కళ్యాణ్ వివరిస్తారని పార్టీ నేతలు వివరించారు. డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు యువశక్తి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత, పార్టీ సీనియర్ నాయకులు కోట రాంబాబు,మండల పార్టీ ఉపాధ్యక్షులు జరుగు ఆదినారాయణ,కార్యదర్శి బడే రాజశేఖర్ ,మేడ పిచ్చియ్య జరుగు నారాయణ రావు , తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కును కాపాడుకుందాం

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

పోరాటాల ద్వారానే విశాఖ ఉక్కుకర్మాగారాన్ని కాపాడుకోగలమని ఏఐటీయూసీ నాయకులు టి.తాతయ్య అన్నారు. కృష్ణాజిల్లా ఎఐటియుసి కౌన్సిల్ సమావేశం మంగళవారం స్థానిక శ్రీహరిరావు భవన్‌లో కరపాటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. తాతయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కొంతమంది కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తోందన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా చౌక్‌లో ఉదయం 10 గంటలకు నిరాహార దీక్ష చేపడతామన్నారు. బందరు నియోజకవర్గ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కర్పాటి సత్యనారాయణ, వై.ఈశ్వరరావు, ఓఎల్ రావు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) బాలు నాయక్‌ను గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022 ) రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఛానల్ కల్పించాలని, బిఎల్‌వో డ్యూటీ ల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఇతర విభాగాల పనులు కేటాయించకుండా చూడాలని, ఒకే శాఖ అజమాయిషి ఉండాలని, మరో సిస్టం కేటాయించాలని, ఏ సచివాలయంలోనైనా బయోమెట్రిక్ వేసే వెసులుబాటు ఇవ్వాలని, జిఒ ట్యాగింగ్ అలవెన్స్ ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు పార్థ మధు, ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ నవీన్, మురళీకష్ణ పాల్గొన్నారు.

## ఫినో పేమెంట్స్ బ్యాంక్ వడ్డీ పెంపు

**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్:** ఫినో పేమెంట్స్ బ్యాంక్ సేవింగ్స్ డిపాజిట్‌పై వడ్డీ రేటును 5 శాతంకు పెంచినట్లు బ్యాంకు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆశిష్ ఒక ప్రకటనలో తెలిపారు.లక్ష కంటే ఎక్కువ బ్యాలెన్స్‌కు సంవత్సరానికి 5 శాతం పొదుపు వడ్డీని ప్రకటించినట్లు తెలిపారు. ఇది జనవరి 7వ తేదీ నుండి అమలులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకుకు 60 లక్షల మంది కస్టమర్లతో పాటు ్రతి నెలా 2.5 లక్షల మందికిపైగా కొత్త వారికి ప్రయోజనం చేకూర్చే విధ:గా వడ్డీరేటును పెంచుతున్నట్లు తెలిపారు.

## ఏస్ ఈవీ డెలివరీలు ప్రారంభం

**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ :** వాణిజ్య వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ఏస్ ఈవీ డెవలివరీలను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి శ్రీనాథ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత అధునాతన ,జీరో ఎమిషన్, ఫోర్‌వీల్ చిన్న తరహా వాణిజ్య వాహనాల్లో సరికొత్త ఏస్ ఈవీ ఇంట్రా సిటీ కార్గో ట్రాన్స్‌పోర్టుకు అనువైన విధంగా వాహనం ఉంటుందని తెలిపారు. ఈకామర్స్, కొరియర్ కంపెనీలు, అమెజాన్, డెలివరీకి సంబంధించిన కంపెనీలు డెలివరీలకు ఏస్ ఈవిల వాహనాలను డెలివరీ చేసినట్లు తెలిపారు.

## మొబైల్ అన్న క్యాంటీన్

**ప్రజాశక్తి-వన్‌టౌన్ :** టిడిపి సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో ప్రతిరోజు రోజుకో డివిజన్‌లో మొబైల్ అన్న క్యాంటిన్ ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా తెలిపారు. కేశినేని ఫౌండేషన్ వారిచే నడపబడుతున్న మొబైల్ అన్న క్యాంటీన్ మంగళవారం 70వ రోజుకు చేరింది.

## పోరంకి సెంటర్లో సిఐటియు నిరసన

**ప్రజాశక్తి - పెనమలూరు :** జీవో నెంబర్ 1 రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో పోరంకి సెంటర్లో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎ.శాస్త్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఇలాంటి జిఒలు జారీ చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ఈ జిఒను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు పెనమలూరు మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ ఎప్పుడో బ్రిటిష్ కాలం నాటి చట్టాలు తీసుకొచ్చి ప్రజల మీద రుద్దడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కె కాసిం, ఆర్టీసీ శ్రీనివాసరావు, అన్నవరపు శ్రీనివాసరావు, ఆర్టీసీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రకటన

అన 2023 వసం. జనవరి నెల 10 వ తారీకున నాక్లయింట్లు సయ్యద్ సలీమ్ గారి కుమారుడు సయ్యద్ అనాజ్ మరియూ వారి శ్రీమతి సల్మాగార్ల సంజాయిషీ పొంది యావన్మందికి తలియచేయునది ఏమనగా, నాక్లయింటు దిగువ షెడ్యూలాస్తిని విజయవాడ కాపురస్తులు షేక్ ఖాసిమ్ పీరా మరియూ వారి శ్రీమతి షకీలా బేగంగార్ల వద్ద ది.27-06-2022వ తేదీన విజయవాడ సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో విక్రయదస్తావేజు నెం. 7627/2022 ద్వారా కొనుగోలు చేసియున్నారు. సదరు షేక్ ఖాసిమ్ పీరా మరియూ వారి శ్రీమతి షకీలా బేగం గారు ది.31-07-2014వతేదీన విజయవాడ సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో విక్రయదస్తావేజు నెం. 8566/2014 ద్వారా మరియంబి మరియూ షేక్ జానీ సాహెబ్ సంతతిగార్ల వద్ద కొనుగోలు చేసియున్నారు. షేక్ జానీ సాహెబ్ సంతితిలో ఒకరైన షేక్ కరిముల్లా గారు 2014వ సంవత్సరమునకు ముందే ఇల్లు వదిలి వెళ్ళిపోయినట్లుగానూ మరియూ అందుకు గానూ విజయవాడ కొత్తపేట పోలీసు స్టేషను వారు నాన్ ట్రేస్డ్ సర్టిఫికెటను కూడా ఇచ్చియున్నారు. మరియూ నాక్లయింట్లు ఈ దిగువ షెడ్యూలు ఆస్థిపై బుణము పొందు నిమిత్తం, బ్యాంకులను సంప్రదించుట జరుగుచున్నది. కనుక ఈ షెడ్యూలు ఆస్థిపై ఎవరికైనా ఎట్టిక్రయములు గాని, అభ్యంతరములు గాని ఉన్నయెడల ఈ దిగువ అడ్రసుకు ప్రకటన తేదీ నుండి వారం రోజులలోపు వ్రాత పూర్వకంగా తెలియచేయవలెను. దరిమిలా వచ్చు అభ్యంతరములు నాక్లయింట్లను బైండు చేయజాలవనిన్నీ మరియూ ఈ ఆస్థిని నిష్పేచీగా భావింతురని ఇందుమూలముగా తెలియజేయుటమైనది.

షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా (లోగడ కృష్ణాజిల్లా), విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని విజయవాడ-1 టవున్ వించిపేట మహాలక్ష్మి గుడి వీధిలో గల ఆస్థికి రెవిన్యూ వార్డు నెం.4, బ్లాకు నెం. 5, యన్.టీ.యస్.నెం.136, పాత అసెన్‌మెంట్ నెం.10194, న్యూ అసెన్‌మెంట్ నెం.1073028399, న్యూ వార్డు నెం.36, డోరు నెం. 8-9-37ర్లు దాఖలా చ.గ. 58.28లు స్థలము, అందలి డాబా యింటితో సహా గల స్థిరాస్తికి హద్దులు: **తూర్పు:** అశోక్ గారి ఆస్థి-16.6 అ.లు, **దక్షిణం:** ఆసిఫ్ పాషాగారి ఆస్థి-31.8 అ.లు, **పడమర:** మహాలక్ష్మి గుడి వీధి అనే మునిసిపల్ రోడ్డు-16.7 అ.లు, **ఉత్తరం:** షేక్ రహిమున్నిసా గారి ఆస్థి-32.3 అ.లు ఈ హద్దుల మధ్య 58.28 చ.గ.లు అందలి యావత్తు యిజిమెంట్ హక్కులతో సహా...

ఇట్లు
**సి.యస్.యస్.ఆర్ వేణుగోపాల్, అడ్వకేట్,**
26-20-15, 2వ ఫ్లోరు, స్వామి వీధి,
విజయవాడ-3. **Cell : 9848234515.**

తేది : 10-01-2023
స్థలము : విజయవాడ

**INTHE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT MACHILIPATNAM**
**E.P.No.156/2018 in A.C.No. 09/2018.**

Between :
Margadarsi Chit Fund Pvt.Ltd.,
Represented by its Manager-cum-Foreman, Machilipatnam
... Petitioner / DHR
AND
Mr. Penumatsa Madhusudhana Rao
& others ...Respondents / JDR□s

పై నెంబరు డిహెచ్ఆర్ కు జేడిఆర్ నుండి రావలసిన డిక్రి బాకి క్రింద 6వ జేడిఆర్ అయిన పెనుమత్స లక్ష్మీ తాలుకా ఇస్తిహారు దాఖలా స్థిరాస్థిపై కోర్టు వారి ఎదుట ది.24-01-2023 ఉదయం 10.30.ని॥ల నుండి సాయంత్రం 5.00 గంటల మధ్య వేలం ద్వారా విక్రయించుటకు కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చినారు. కావున వేలం పాటలో పాల్గొనదలచిన పాటదారులు కోర్టువారి ఎదుట హాజరు అయి పాటలో పాల్గొనవచ్చును.

Immovable property of house beaering D.No.15/207-39-1, ward No.15, R.S.No. 199, Extent of 204.16 Sq.Yds equilent to 170.70 sq.Mts. Situated in Dasarivari Street, Machavaram, Machilipatnam, Krishna District, Within the jurisdiction of Register office (OB), Matchilipatnam, bounded as follows: East: site of P.Malleswara rao - 36.9 ft. South: site of Kolluri Krishna Murthy and Sannala Geetha and Panditha Rajeswari - 50ft. West: 33ft. width Road - 36.9ft, North: 6ft width joint pathway - 50ft.

DHR విలువ: రూ.22,00,000/-
అమినా విలువ: రూ.35,00,000/-
వేలం వాయిదా ది.24-01-2023
Further hearing date: 31-01-2023
Market Value : Rs.32,29,120/-
Note:ECదాఖాలా అన్యాక్రాదతము ఏమియును లేవు.
// By Court order//
Machilipatnam
Date: 06-01-2023

**Sri Md.Zafrullah**
**Advocate**
**Machilipatnam.**

### మొదటి పేజీ తరువాయి

## 'మైలవరం' రసవత్తరం

నుంచి చాలా దగ్గరగా రాజకీయాలు చూశా, అయినా నేటి రాజకీయాల్లో నేను ఇమడలేక పోతున్నాను, రౌడీయిజం చేతగాక పాతతరం నాయకుడుగానే మిగిలిపోయాను, రౌడీలను వెంటేసుకుని తిరిగితేనే ముందుకెళ్లే పరిస్థితులున్నాయి, సగటు వ్యక్తులకు సహాయం కూడా చేయలేపోతున్నాను, ఒక్కోసారి రాజకీయాల్లోకి ఎందుకొచ్చానా అని బాధపడుతున్నాను" అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత రాజకీయాలను, నేటి రాజకీయాలను పరిశీలిస్తే ఎంతో మార్పు కనిపిస్తోందన్నారు. రౌడీలను వెంటబెట్టుకుని రాజకీయం చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని వ్యాఖ్యానించారు. తాను ఎంఎల్ఎ ఎన్నికైన మూడున్నర ఏళ్లలో తాను ఎవరిపైనా తప్పుడు కేసులు బనాయించలేదన్నారు. అర్హులకు పథకాలు ఆపలేదన్నారు. ఈ విషయంపై కొంతమందికి తనపై అసంతప్తి ఉండొచ్చని పేర్కొన్నారు. ఇటీవల గుంటూరులో జరిగిన చంద్రబాబు సభలో తొక్కిసలాట జరిగి ముగ్గురు మహిళలు మరణించిన ఘటనపై ఎంఎల్ఎ వసంత వైసిపిని ఇరుకున పెట్టే వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు సభలో చీరలు పంపిణీ చేసిన ఎన్ఆర్ఐ ఉయ్యూరు శ్రీనివాసరావు సేవా దక్పధాన్ని కొనియాడటంతోపాటు జరిగిన సంఘటనను ఉలవలు, చిలవలుగా చిత్రీకరించడం బాధాకరమంటూ వ్యాఖ్యానించారు. ఇలా చేస్తే ఎన్ఆర్ఐలు భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు చేసేందుకు రాష్ట్రానికి రాకుండా పోతారన్నారు. ఇటీవల జగ్గయ్యపేటలో జరిగిన కమ్మ వనసమారాధనలో తన తండ్రి, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై కృష్ణ ప్రసాద్ పార్టీకి వివరణ ఇచ్చుకున్నా తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలతో పార్టీ మారతారనే చర్చ జోరుగా సాగుతోంది. మంత్రి జోగి రమేశ్ గ్రూపునకు, ఎంఎల్ఎ కృష్ణ ప్రసాద్ గ్రూపునకు మధ్య నెలకొన్న వివాదాల కారణంగా నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లిలో 70 మంది స్థానిక ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసినా పరిస్థితి కొలిక్కి రాలేదు. సిఎంతో సమావేశం ముగిసిన కొద్దిరోజుల తర్వాత కృష్ణ ప్రసాద్ తాను టిడిపిలోకి వస్తున్నానని దేవినేని ఉమా భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. అంతేగాక చంద్రబాబు, లోకేశ్‌లను తిట్టేవిధంగా చేస్తున్నారని, అలా ఎన్నటికీ జరగదని చెప్పడం వైసీపీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. కొంతకాలంగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై గుర్రుగా ఉన్న వసంత...ప్రస్తుతం "గడపగడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని కూడా వాయిదా వేశారు.

## ఎంపి కేశినేనిని కలిసిన వసంత నాగేశ్వరరావు

దీనిపై మాజీ మంత్రి వసంత మంగళవారం వివరణ ఇచ్చారు. నాని కుమార్తె వివాహానికి వెళ్లలేకపోవడంతో తాజాగా ఆయనను కలిశానని చెప్పుకొచ్చారు. గ్రామంలో అభివద్ధి పనులకు సంబంధించి అంచనాల కాపీలు అందజేశామని, టిడిపి ఎంపిగా ఉండి కూడా తనకు నిధులు కేటాయిస్తామనడం పట్ల గ్రామప్రజల ద్వారా ధన్యవాదాలు తెలుపుతున్నానని మీడియాకు వెల్లడించారు. ఇటీవల జగ్గయ్యపేటలో జరిగిన కమ్మ వనసమారాధనలో వసంత నాగేశ్వరరావు కమ్మసామాజిక వర్గానికి వైసిపి ప్రభుత్వ పదవుల్లో ప్రాధాన్యత లేదనటం తీవ్ర దుమారం లేపిన విషయం తెలిసిందే.

## గుణదల ఫ్లైవోవర్‌కు మోక్షమెప్పుడు ?

దాల్చలేదు. మరోవైపు ఈ ఫ్లైవోవర్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియ ఇంతవరకు పూర్తి కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏలూరు వైపు 27 సెంట్లు, నున్నవైపు మరో 32 సెంట్లను సేకరించాల్సి ఉంది. అంతేకాకుండా ప్రభుత్వ స్థలాల్లో కట్టిన 107 ఇళ్లను తొలగించి, బాధితులకు పునరావాసం కల్పించడంతో పాటు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. కానీ ఈ పనులు కూడా నేటికీ కొలిక్కి రాలేదు. దీనిని పూర్తి చేసేందుకు ఆర్అంబ్‌బి అధికారులు రూ.70 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించి అనుమతుల కోసం ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన అనంతరం టెండర్లు ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## అవినీతికి కేరాఫ్‌గా జడ్‌పి

వస్తున్నాయి. లక్షలాది రూపాయల విలువైన మెటీరియల్ కొనుగోలుకు ఎటువంటి టెండర్లు ఆహ్వానించలేదు. స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ విభాగం 10వ తరగతి మోడల్ ప్రశ్నాపత్రాలు, వాటికి సమాధానాలను అన్నింటిని ఒకే పుస్తకంలో ముద్రించి పంపిణీ చేసింది. జిల్లా పరిషత్‌లో పనిచేసే ఓ ఉద్యోగి ఇంటి కింద ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లోనే ఈ పుస్తకాలు ముద్రణ జరగడం గమనార్హం. ఒక్కో పుస్తకం ముద్రణకు రూ.60 ఖర్చయితే స్ఫూర్తి సంస్థ రూ.120 చొప్పున బిల్లు పెట్టింది. మెటీరియల్‌కు రూ.18 లక్షలు వ్యయం చేసి రెట్టింపు రూ.36 లక్షలు వరకు బిల్లులు పెట్టినట్లు సమాచారం.

ఉద్యోగుల ప్రమోషన్లు, నియామకాల్లో గందరగోళం

జిల్లా పరిషత్‌లో ముగ్గురికి సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతలు కల్పించారు. ఎటువంటి నిబంధనలు పాటించకుండానే ప్రజాప్రతినిధి బంధువుకు ప్రమోషన్ కల్పించి, విజయవాడలోని డ్వామా పీడీ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు తెలుస్తోంది. 10 మంది అధికారులు సెప్టెంబర్లో ప్రమోషన్‌పై జిల్లా పరిషత్ కార్యాలయంలో చేరారు. కానీ మూడు నెలలుగా వారికి కార్యాలయంలో సీటు కేటాయించలేదు. అటెండెన్స్ నిమిత్తం బయోమెట్రిక్ వేసిన తర్వాత చెట్ల కింద కాలక్షేపం చేయాల్సి వస్తోందని వారంతా వాపోతున్నారు. అలాగే ఎటువంటి ప్రకటన లేకుండానే ప్రజాప్రతినిధికి చెందిన మరో 10 మంది అస్మదీయులను కాంట్రాక్టు పద్ధతిలో జిల్లా పరిషత్‌లో అటెండర్ స్థాయి ఉద్యోగులుగా నియమించుకుని నెలవారీగా జీతాలు రూపంలో రూ.1.20 లక్షలు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరంతా రోజువారీగా కార్యాలయానికి వస్తారో లేదో కూడా పర్యవేక్షించే ధైర్యం ఏ అధికారీ చేయడం లేదంటున్నారు.

**వేలం ప్రకటన**
**మహారాజశ్రీ మచిలీపట్నం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో...**
**EPNO:- 34/07 in OS No:- 92/1992**

Between :
స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి మచిలీపట్నం. చీఫ్ మేనేజరు ..... DHR
మరియు
సామా వెంకటపూర్ణ సుగుణకుమారి ... JDR

పై నెంబరు EPలో తీర్పు ఋణగ్రస్తురాలి వల్ల రావలసిన డిక్రీబాకీ ఖర్చులు వగైరా క్రింద పైనెంబరు లోని తీర్పు ఋణగ్రస్తురాలి యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో యున్నటువంటి డిక్రీ షెడ్యూలు దాఖలా తనఖా స్థిరాస్థిని ఈ నెంబరు డిక్రీ బాకీ క్రింద జప్తు చేయించి పైకోర్టు వారి ఎదుట ది. 27-01-2023వ తేదీన ఉదయం గం.10-30 ని.ల లగాయితు వేలం జరపబడును. కావున కావలసిన వారు వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

**షెడ్యూలు**
కృష్ణాజిల్లా బందరు సబ్‌రిజిస్ట్రారు వారి యిలాఖా కరగ్రహారం గ్రామములోని ఐటమ్ నెం.5. రీసర్వే నెం.271/3 లో య.2.48 సెంట్లు భూమికి హద్దులు. తూర్పు: గవర్నమెంటు భూమి, పడమర: కె.తెలగ రాజు భూమి. ఉత్తరం: ఎ.సూరమ్మ భూమి. దక్షిణం: గవర్నమెంటు భూమి,

DHR విలువ రూ.10,00,000/-
అమీనా విలువ రూ.15,50,000/-
వేలం తేది : 27-01-2023

ఇట్లు
**పసుమర్తి రమాకాంత్**
**అడ్వకేట్ ఫర్ డిహెచ్ఆర్**
**మచిలీపట్నం.**
సెల్ నెం: **9849616224**

**మచిలీపట్నం**
ది. 10-01-2023.

**IN THE COURT OF THE VIII ADDL DISTRICT JUDGE: VIJAYAWADA**
**O.S.No.56 / 2014**

Between:-
Vallabhaneni Madhavi......Plaintiff
And
5. Chakka Venkateswaramma
W/o Late Gajendra Varma, Hindu,
aged about 58 Years,House wife,
R/o Door No. 41-1/5-115, 1st Lane,
Dwaraka Nagar, Krishna Lanka,
Vijayawada
....**Defendant No. 5**

In the above-mentioned Proceedings, the Hon'ble Court was pleased to order summons to the Defendant No.5 by way of publication as substitute service. The above matter is stands posted to 31-01-2023. Hence the Defendant No. 5 is requested to attend before the above-mentioned Hon'ble Court on 31-01-2023 at 10.30 A.M either in person or through her advocates failing which the matter will be decided exparte.

Ch. Manmadha Rao,
Smt.Ch. Nirmalatha,
Ch. Sai Saran, Advocates,
Labbipeta,Vijayawada-10.
Cell.9885443339

Vijayawada,
Dt.08-01-2023.

**IN THE HONOURABLE COURT OF THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI**
**TRCMP NO: 282/2022**

BETWEEN:
ANISETTY SRIKAVYA .....PETITIONER
AND :
ANISETTY AYYAPPARAJU RAJA
....RESPONDENT
TO
ANISETTY AYYAPPARAJU @ RAJA, s/o SATYANARAYANA, RESIDING AT OUARTER No: 179/G, RAILWAY QUARTERS, VIJAYAWADA

**NOTICE**

PLEASE TAKE NOTICE THAT THE ABOVE MATTER STANDS POSTED TO **24-01-2023** FOR ADDIMISSION AND NOTICE TO THE RESPONDENT. SO YOU SHOULD APPEAR IN PERSON OR THROUGH AN ADVOCATE AT **10:30 am** ON THE ABOVE SAID DATE IN THE ABOVE COURT.

IF YOU FAIL TO APPEAR ON THE SAID DATE THE ABOVE CASE WILL BE DECIDED IN YOUR ABSENCE

**TADDI SOWMYA NAIDU**
**ADVOCATE**
**TADEPALLI**

## పిల్లలను బడికి పంపాలి

**ప్రజాశక్తి-కోడూరు**

నిరుపేద కుటుంబాల్లోని పిల్లలు బడికి సరిగ్గా హాజరు కాకుండా బడిబయటి పిల్లలుగా మారుతున్నారు. దీనిని అరికట్టి బాల్యాన్ని సంరంక్షించే బాధ్యతను కోడూరు మండలం టీచర్లు తీసుకుంటున్నారు. మండల విద్యాశాధికారి టివిఎం రామదాసు సూచనలు మేరకు ఎంపియుపి స్కూల్ కోడూరు హెచ్ఎం కాశీభొట్ల నాగభూషణం బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. చాలాకాలం నుంచి స్కూల్‌కి హాజరు కాని పిల్లల ఇంటికి వెళ్ళి వారిని పాఠశాలకు పంపేలా తల్లిదండ్రులకు నచ్చచెప్పారు. ఇస్మాయిల్ బేగ్ పేటలోని కర్రా నరేష్, నీలా సాయి చాలా కాలంనుంచి బడికి హాజరుకావటం లేదు. దీనివలన వీరికి జగనన్న అమ్మఒడి, విద్యాకానుక వంటి పథకాలకు అనర్హులవుతున్నారు. దీనిగురించి స్థానిక వార్డు వాలంటీర్లు శ్రావణి, రజని, కోడూరు-3 సచివాలయం సెక్రటరీ తుంగల వెంకట శివ లతో కలిసి పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యా పథకాల గురించి వివరించారు. పిల్లలను బడికి తీసుకొచ్చి జగనన్న విద్యాకానుక (కిట్)ను అందించారు. మీరి వెంటటీచర్లు శ్యామల, సుమన్, లక్ష్మి పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

## వైసిపికి ఎందుకంత భయం : మండలి

**ప్రజాశక్తి-చల్లపల్లి**

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలయిక వైసీపీ నేతల్లో దడపుడుతోందని మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పాగోలులో మంగళవారం పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు ప్రజా సమస్యలు మరిచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలయికపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కలిస్తే వైసీపీ మంత్రులు పిరికితనంతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల గురించి ఒక్క మంత్రి మాట్లాడట్లేదని విమర్శించారు. వైసీపీ తీరుతో రాష్ట్రం అధోగతి పాలవుతోందన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్ర భవితకు భరోసా ఇవ్వట్లేదన్నారు. వైసీపీ వారు కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారన్నారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహించకుండా విమర్శలతో మంత్రులు కాలక్షేపం చేస్తున్నారన్నారు. ఈ పర్యటనలో ఘంటసాల మండల టిడిపి అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, మాజీ జిల్లా చైర్‌పర్సన్ గొర్రెపాటి రామకృష్ణ, సీనియర్ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు

ధాన్యాన్ని పరిశీలిస్తున్న బుద్ధప్రసాద్

## కేన్సర్ రోగికి 'తోట' సాయం

**ప్రజాశక్తి-గన్నవరం**

గన్నవరం మండలం సావరగూడెంలో గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న మారెళ్ళ రామకృష్ణకు వైద్య సహాయ నిమిత్తం కాపు ఐక్య సమ్మేళనం గన్నవరం నియోజకవర్గ అధ్యక్షులు తోట వెంకయ్య రూ.10 వేలు ఆర్థిక సహాయంగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణకు ఎమ్మారై స్కానింగ్ చేయడానికి వైద్యులు రూ.25 వేలు ఖర్చు అవుతుందని చెప్పడంతో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడని చెప్పారు. గ్రామ యువకులు గంగాధర్, రాజా ఈ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో స్పందించి చేతనైన సహాయం చేసినట్లు తెలిపారు. కాపు సామాజిక వర్గంలో పేదలను ఆదుకోవడానికి ప్రభుత్వంతో పాటు తన వంతు సాయంగా సొంత నిధులు వ్యయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాపు ఐక్య సమ్మేళనం గన్నవరం నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోపిశెట్టి వీరాస్వామి, కోశాధికారి దామెర సీతారామయ్య, వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ పామర్తి మాధవరావు, గ్రామ కాపు యూత్ నాయకులు బోయిన జగదీశ్వరరావు, కొండ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న తోట వెంకయ్య

# సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్**

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించటం ద్వారా మంచి వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తే ఆరోగ్య వంత మైన పంటలు పండించగలరని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి అన్నారు. మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సుల్తానగరంలో రైతులకు (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ ) పొలంబడీ కార్యక్రమం జరిగింది. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా మచిలీపట్నం మండలంలో సుల్తాన్ నగరం, ఎస్ ఎన్ గొల్లపాలెం, అరిసేపల్లి గ్రామాల్లో మంచి వ్యవసాయ పద్ధతుల్లో మేలైన దిగుబడి సాధించేలా రైతులను సన్నద్ధం చేసే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పైమూడు గ్రామాల్లో ప్రతి మంగళ, బుధ, గురువారాల్లో రైతుల పొలం వద్ద రైతుల భాగస్వామ్యంతో మంచి వ్యవసాయ పద్ధతులపై అవగాహనా, ఆచరణలో చేసి చూపిస్తామని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (సేంద్రియ సాగు ) పార్ధ సారధి అన్నారు. ఇందుకు గాను మూడు గ్రామల్లో కలిపి మొత్తం 163 రైతులు,100 హెక్టార్లలో మూడు సంవత్సరాలు వరుసగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంచి వ్యవసాయ పద్ధతులు పాటింప చేసి ఆ తర్వాత ప్రభుత్వం అందించే సర్టిఫికెట్ పొందాలన్నారు. తద్వారా మెరుగైన ధరకి తమ ఉత్పత్తులను అమ్ముకునేలా వ్యవసాయ శాఖ పూర్తి సహకారాన్ని అందిస్తుందని మచిలీపట్నం మండల వ్యవసాయ అధికారి శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యత

**ప్రజాశక్తి-అవనిగడ్డ**

సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కొనియాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవనిగడ్డ ఐదో గ్రామ సచివాలయ పరిధిలో కొత్తపేట, తిప్పపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలను నిత్యం ప్రజల మధ్యనే ఉండమంటున్నారన్నారు. మంచి జరిగితేనే ఆదరించమని సీఎం చెబుతున్నారని ఇలా దమ్ముగా చెప్పిన సీఎం గతంలో ఎవరూ లేరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసిపి అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, కొత్తపేట పిఎసిఎస్ అధ్యక్షులు బడే వెంకటేశ్వరరావు, పంచాయతీ ఉప సర్పంచ్ గాజుల జై గోపాల్, ఎమ్మెల్యే తనయుడు వైసిపి యువ నాయకులు సింహాద్రి వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పురుషుల బాల్‌బ్యాడ్మింటన్ శిబిరం

**గుడ్లవల్లేరు :** స్థానిక ఎస్ఆర్ శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జెఎన్‌టియుకె కాకినాడ పురుషుల బాల్ బాడ్మింటన్ జట్టుకు కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఎం.శివశంకర్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10 వరకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరానికి వివిధ కళాశాలలకు చెందిన 10 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 13 నుండి 17 వరకు మంగళూరులో నిర్వహించబోయే దక్షిణ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వీరు పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులను కళాశాల యాజమాన్యం, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ పి.కోదండ రామరావు, డాక్టర్ ఎం. ఆర్.సి.పెంచ్ శాస్త్రి, డైరెక్టర్ డాక్టర్ బి.కరుణ కుమార్, డాక్టర్ పి.రవీంద్రబాబు, వ్యాయామ అధ్యాపకులు శివశంకర్, జి.వెంకటేష్, డి.పూజిత అభినందనలు తెలిపారు.

## ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయొచ్చు

**గన్నవరం :** ఏడాదికి రెండుసార్లు రక్త దానం చేస్తే గుండె జబ్బులు , క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశం బాగా తగ్గుతుందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి బి.శంకర్ నాథ్ చెప్పారు. మంగళవారం గన్నవరం వికేఆర్ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గన్నవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన సదస్సు, విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ నిర్ధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో శంకర్‌నాథ్ మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు వారి వరకు రక్తదానం చేయొచ్చునని పేర్కొన్నారు. మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడంతో మనిషికి శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు లివర్ బాగా పనిచేస్తుందన్నారు. అందువల్ల సురక్షితమని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతోందన్నారు. అనంతరం 300 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి గ్రూపు నిర్ధారణ చేశారు. కార్డులు జారీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ సాయి అరుణ్, రెడ్ క్రాస్ జీవిత సభ్యులు మద్దుకూరి విజయకుమార్, స్వర్ణ కుమారి, శ్రీ ప్రభాకర్ చౌదరి, రాజకుమార్, నవీన్, సురేష్, దుర్గారావు, జొన్నలగడ్డ ఏడుకొండలు పాల్గొన్నారు..

మాట్లాడుతున్న శంకర్‌నాథ్

## 'జీవన ప్రమాణం'ను సద్వినియోగం చేసుకోవాలి

### ఖజానా శాఖ ఉప సంచాలకులు రవికుమార్

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

జిల్లాలో పెన్షన్ దారులు ప్రభుత్వం రూపొందించిన జీవన ప్రమాణం, ఫేషియల్ యాప్ లు ద్వారా తమ పెన్షన్‌ను రెన్యువల్ చేసుకోవచ్చని జిల్లా ఖజానా శాఖ ఉపసంచలకులు ఎస్ రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన బందరు సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పెన్షన్ దారుల రెన్యువల్ ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ దారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం ఈ ఏడాది జీవన ప్రమాణం, ఫేషియల్ యాప్ రూపొందించిందని ఈ యాప్ల ద్వారా పెన్షన్ దారుడు కార్యాలయానికి రాకుండా నేరుగా తమ పెన్షన్ రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. ఇతర ప్రాంతాలు,ఇతర దేశాల్లో ఉన్న పెన్షన్ దారులు ఈ యాప్‌లను డౌన్ లోడ్ చేసుకొని తమ రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 28వ తేదీలోగా ప్రతి పెన్షన్ దారుడు తమ పెన్షన్‌ను రెన్యువల్ చేసుకోవాలన్నారు. అలాగే ఎవరైనా లేవలేని పరిస్థితిలో ఉంటే పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు, ట్రెజరీ అధికారులు నేరుగా వారి ఇంటి వద్దకు వచ్చి వారి రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బందర్ సబ్ ట్రెజరీ అధికారి రమేష్ ఉన్నారు.

యాప్ గురించి తెలియజేస్తున్న రవికుమార్

## 15న సంక్రాంతి ఆటల పోటీలు

**ప్రజాశక్తి -మొవ్వ**

సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15న మొవ్వ మండలం చినముత్తేవిలో గ్రామస్థాయిలో సంక్రాంతి ఆటల పోటీలు జరుగుతాయని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఐద్వా), డివైఎఫ్ఐ), ఎపి కౌలురైతుల సంఘం చినముత్తేవి గ్రామ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో అమరవీరులు పోతుల బ్రహ్మదేవుడు, బండి కోటేశ్వరరావుల స్ఫూర్తితో ఈ పోటీలు జరుగుతాయన్నారు. చినముత్తేవి వేదికగా గ్రామస్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు కుర్చీలాట,16 సంవత్సరాల లోపు యువకులకు పరుగు పందెం, స్లో సైక్లింగ్ అంశాలలో సంక్రాంతి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే ఔత్సాహిక మహిళలు చినముత్తేవి శివాలయం వద్ద మధ్యాహ్నం రెండు గంటలకు హాజరై ఎంట్రీ ఫీజు రూ.5 చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే సంక్రాంతి పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు చరవాణి : 9490098467 ,7731934707 ,9381088299 ,995168699లో సంప్రదించాలని కోరారు.

## ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

**ప్రజాశక్తి-ఉంగుటూరు**

నానాటికీ పెరుగుతున్న ధరలను నియంత్రించటంలో రాష్ట్రప్రభుత్వం విఫలమయ్యిందని టిడిపి ఉంగుటూరు మండల అధ్యక్షులు డాక్టర్ ఆరుమళ్ల వెంకటకృష్ణా రెడ్డి విమర్శించారు. ఉంగుటూరు మండలంలోని చాగంటిపాడు గ్రామంలో 'ఇదేం కర్మ మన రాష్టానికి' కార్యక్రమం టిడిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఉంగుటూరు మండల టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి జంపా నాగ రమేష్, పసుపులేటి కిషోర్, సోమిశెట్టి లక్ష్మణస్వామి, జంపా సాంబశివరావు, జంపా కబీరుదాసు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, జంపా వెంకటేశ్వరరావు, జంపా రాంబాబు, కళ్యాణం శేషగిరిరావు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# ఫిష్ రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుపై దృష్టి : కలెక్టర్

**ప్రజాశక్తి-విజయవాడరూరల్:** జిల్లాలో ఫిష్ రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుపై ప్రత్యేక దష్టి పెట్టాలని, మత్స్య సంపదకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం అమల్లో భాగంగా మినీఫిష్ వెండింగ్ రిటైల్ అవుట్ లెట్స్ ఏర్పాటుపై మంగళవారం గొల్లపూడిలోని టిటిడిసి భవనంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్గయ్యపేట, తిరువూరు, విజయవాడ పరిధిలో 231 యూనిట్లు స్థాపించేందుకు లక్ష్యంగా నిర్ణయించామని, వీటిలో 219 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ఇప్పటికే 131 మంది లబ్ధిదారులు మినిఫిష్ వెండింగ్ రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు సంబంధించి లబ్ధిదారు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించాలన్నారు. వీరిలో 75 మంది

లబ్ధిదారులకు సంబంధించి జాబితాను బ్యాంకులకు పంపించామని వీరిలో 16 మంది లబ్ధిదారులకు బ్యాంకుల నుండి రుణాలు మంజూరయ్యాయన్నారు. మిగిలిన లబ్ధిదారులకు త్వరితగతిన బ్యాంకుల నుండి రుణాలను మంజూరు చేయించి యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. కోటి రూపాయల యూనిట్ ధరతో రాజరాజేశ్వరిపేటలో ఏర్పాటు చేయబోయే ఫిష్ రిటైల్ హబ్, 50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయబోయే ఫిష్ రిటైల్ అవుట్ లెట్లు, ఆర్‌టిసి పాత బస్టాండ్, గొల్లపూడి డిఆర్డీఏ స్థలంలో, తిరుపూరు, ఎన్టిఆర్ ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ వద్ద, 20 లక్షల రూపాయలతో నగరంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయబోయే 14 లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు, 10 లక్షల రూపాయలతో నగరంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేయబోయే 18 ఫిష్ కియోస్క్ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులు బ్యాంకుల నుండి రుణాల మంజూరు తదితర ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఏ నాగరాజా, డిఆర్డిఎ పీడీ కె.శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వై.వీరశేఖర్, మెప్మా పీడీ ఎస్ఎస్ విశాలాక్షి, ఎన్ సిహెచ్ చక్రాణి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటయ్య సేవలు మరువలేనివి : సిపిఎం

**ప్రజాశక్తి-వత్సవాయి:** తమ్మినేని వెంకటయ్య సిపిఎం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని సిపిఎం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు అన్నారు. మండలంలోని పొలంపల్లి గ్రామంలో తమ్మినేని వెంకటయ్య 22వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగరవేసి తమ్మినేని వెంకటయ్య, దారెల్లి నాగేశ్వరావు స్థూపాలుకు పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ తమ్మినేని వెంకటయ్య రైతులు, కార్మికుల సమస్యల సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. రైతు సంఘం అభివృద్ధికి ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, సీనియర్ నాయకులు మండపూడి చంద్రశేఖర్, తమ్మినేని రాంబాబు, బి రాము, కంచర్ల కొండయ్య, కంచర్ల నాగరాజు, పెంటి కోటేశ్వరావు, రాయల వెంకటి, కెవిపిఎస్ నాయకులు బూతుపల్లి బిక్షం, కౌలు రైతు సంఘం మండల నాయకులు జాను కోటయ్య, రాయల్ ఏసేపు, ఏసుపోగు వెంకటరత్నం పాల్గొన్నారు.

## నల్గొండ ఎంపి సతీమణి పర్యటన

**ప్రజాశక్తి-వత్సవాయి:** చిట్యాల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మంగళవారం నల్గొండ పార్లమెంట్ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి కోదాడ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు పద్మావతి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు ముందుగా ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను స్వగృహంలో విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను మర్యాదపూర్వకంగా కలిశారు. సంక్రాంతి సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు మహిళా నేతలకు విమలభాను, పద్మావతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

## షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రజాశక్తి-తిరువూరు:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, జెవివి, ప్రజానాట్యమండలి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తిరువూరు ఎంపిడిఓ కార్యాలయం రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు

చేసిన షటిల్ డబుల్స్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం సిఐ భీమరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యత కోసం ఆటలు నినాదంతో ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న పోటీలు సాంప్రదాయ ఆటలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పద్మారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరావు, ప్రజా సంఘాల నాయకులు ఎం.నాగేంద్రప్రసాద్, పతంగి శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, ఎల్.గంగాధర్, కె.పాపారావు, ఎం.హరికష్ణ, కె.వెంకతరత్నం, చెరుకు సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.ప్రభాకరరావు, ఎస్వీ భద్రం పాల్గొన్నారు.

## పిబి సిద్ధార్థ కళాశాలలో వేడుకలు

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గుడ్ హ్యాబిట్స్ క్లబ్, ఉమెన్స్ క్లబ్, కల్చరల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం

కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు సాంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా సాగాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్ తెలియజేశారు. ఈ వేడుకలతో సంక్రాంతి లక్ష్మిని ముందుగానే సిద్ధార్థ ప్రాంగణంలోకి ఆహ్వానించినట్లు కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుడ్ హ్యాబిట్స్ క్లబ్ కన్వీనర్ రోహిణి కుసుమ, ఉమెన్స్ క్లబ్ కన్వీనర్ ఎం.భద్రజ, కల్చరల్ క్లబ్ కన్వీనర్ కే.శివరంజని, అధ్యాపకులు నాగ శశాంక, శ్రావణి పాల్గొన్నారు.

## హిందీ దినోత్సవం

**ప్రజాశక్తి-తిరువూరు:** జాతీయ భాష హిందీ నేర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే మార్గాలు పుష్కలంగా ఉన్నాయని మునకుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యు డు బివివి. భద్రరావు అన్నారు. మంగ ళవారం ప్రపంచ హిందీ దినోత్సవ కా ర్యక్రమంలో హిందీ భాష ప్రాముఖ్యత గురించి ప్రథమ శ్రేణి హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ తెలిపారు. ఈసందర్భంగా ఇటీవల సిల్వర్ జోన్ సంస్థ న్యూఢిల్లీ వారు నిర్వహించిన హిందీ ప్రతిభా పరీక్షలో పాఠశాలకు చెం దిన 14 మంది విద్యార్థులు సాధించిన గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అంతర్జాతీ య హిందీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల హిందీ ఉపాధ్యాయిని టి.నాగమణిరావు పాల్గొన్నారు.

## దేశభక్తిని పెంపొందించాలి

**ప్రజాశక్తి-నందిగామ:** నేటి ఆధునిక యుగంలో యువత దేశభక్తి పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నందిగామ కెవి ఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తుర్లపాటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం నందిగామ జర్నలిస్టుల సంక్షేమ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన

మాట్లాడుతూ నేటి యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదర్ధాలకు అలవాటు పడకుండా చూడాలన్నారు. చదువుతో పాటు క్రీడల వైపు ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ అసోసియేషన్ అధ్యక్షులు వెలది సుగుణ శేఖర్‌రావు, జర్నలిస్టుల సంక్షేమ యూనియన్ నాయకులు పఠాన్ మీరాహుస్సేన్ ఖాన్, ఆకుల వెంకటనారాయణ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆర్చరీ పోటీలు

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలలో భాగంగా అండర్ -14 ఆఇండియన్ రౌండ్ విభాగానికి సంబంధించి ఈనెల 11, 12 తేదీలలో నగరంలోని విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో పోటీలు జరుగనున్నాయి. దీనికి సంబంధించి వివిధ రాష్ట్రాల నుండి 250 మంది క్రీడాకారులు చేరుకోవడంతో మంగళవారం సిద్ధార్థ గ్రౌండ్స్ నందు క్రీడాకారులు ప్రాక్టీస్ మ్యాచ్‌లో పాల్గొన్నారు. పోటీలలో భాగంగా 11, 12 తేదీలలో ఇండియన్ రౌండ్ వ్యక్తిగత విభాగం, టీమ్ విభాగం, మిక్స్‌డ్ టీమ్ విభాగం పోటీలు రుగనున్నాయి. పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు.

## పరిశ్రమల స్థాపనపై అవగాహన

**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్:** బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో ఎపిఐఐసి సహకారంతో పరిశ్రమల ప్రోత్సాహానికి సంబంధించి ఔత్సాహిక

పారిశ్రామికవేత్తలతో అవగాహనా సదస్సును నిర్వహించినట్లు బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.అమరనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారని తెలిపారు. ఎపిఐఐసి మంగళగిరి జిల్లా పరిశ్రమల కేంద్రం వారి సహకారంతో పరిశ్రమకు స్థాపనకు సంబంధించి తగిన విధంగా సూచనలు అందించినట్లు తెలిపారు. ఈసదస్సులో సుమారు 150 మంది పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ పి.వి. సుబ్బారెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ గోపీకృష్ణ, విజయరత్నం పాల్గొన్నారు.

## శ్రీవాహినిలో సంక్రాంతి సంబరాలు

**ప్రజాశక్తి-తిరువూరు:** స్థానిక శ్రీవాహిని కాలేజీలో సంక్రాంతి సంబరాలను చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. సంబరాల్లో భాగంగా భోగి మంటలు, కోలాటం పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసుల హరినామ స్మరణతో కళా శాల ప్రాంగణం పండగ సాంప్రదాయ వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రంగా నాగేంద్రబాబు, కార్యదర్శి ఊటుకూరి సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరావు, కోశాధికారి మూర్తి, ఏవో ముత్యాల కిషోర్‌బాబు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు చెల్లించాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-తిరువూరు:** పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. తిరువూరు సుందరయ్య భవనంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మఒడి పథకాన్ని అనర్హులుగా గుర్తించిన విద్యార్థులందరికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ఇవ్వాల్సిన అమ్మఒడిని వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి ఇస్తానని చెప్పడం వల్ల విద్యార్థులపై ఫీజులు భారం పడుతుందన్నారు. సకాలంలో విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి పథకాలు రాకపోవడంతో తల్లిదండ్రులు సొంత డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంక్షేమ పథకాలలో కూడా ప్రభుత్వం కోత విధించడం సరికాదన్నారు. పిజి చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు

సన్న బియ్యం సరఫరా చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తిరువూరు మండల నాయకులు నాగేంద్ర, వెంకటలక్ష్మి, పవన్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.